సాక్షి సూర్యాపేట

ఆదివారం | 10 | మార్చి | 2024



బీజేపీ పాలన దేశానికి ముప్పు

బీజేపీ పాలన దేశానికి ముప్పు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 8లో



పట్టు వస్త్రాల పరిశీలన

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో సమర్పించేందుకు పోచంపల్లి చేనేత కార్మికులు పట్టు వస్త్రాలు తయారు చేస్తున్నారు. - 10లో



మహాశివుడికి లక్ష బిల్వార్చన

యాదాద్రి క్షేత్రానికి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. - 10లో

న్యూస్‌రీల్

11న ఫణిగిరికి మంత్రి జూపల్లి రాక

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద తాత్కాలికంగా నిర్మించిన మ్యూజియాన్ని ప్రారంభించడానికి ఈనెల 11న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు రానున్నట్లు ఫణిగిరి గ్రామానికి చెందిన బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పులిగిల్ల వీరమల్లు యాదవ్ శనివారం తెలిపారు. గ్రామంలో బౌద్ధ మ్యూజియం ప్రారంభానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ, పురావస్తు, వారసత్వ శాఖ డైరెక్టర్ భారతి హోలికేరిలు రానున్నట్లు పేర్కొన్నారు.

పీఆర్సీ ప్రకటన హర్షణీయం

తిరుమలగిరి (తుంగతుర్తి): తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 21 శాతం పీఆర్సీ ప్రకటించడం హర్షణీయమని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్సీ ప్రకటించడం, పెండింగ్‌లో ఉన్న 50 శాతం ఆర్‌పీఎస్ బాండ్స్‌ను ఇవ్వాలని నిర్ణయించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, కృష్ణ, సోమేష్ గౌడ్, ఎల్లయ్య, పద్మ, నాగమణి, సునీత పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఇళ్లులేని నిరుపేదలైన వ్యవసాయ కార్మికులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు, రెమిడాల రాజు, రావుల సత్యం, మీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల హక్కుల సాధనే లక్ష్యం



నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): మాదిగల హక్కుల సాధనే లక్ష్యంగా టీఎమ్మార్పీఎస్ పోరాడుతుందని ఆ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు కత్తి ఉపేందర్ మాదిగ అన్నారు. శనివారం సూర్యాపేటలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శిరసమల్ల బాలరాజు మాదిగ సమక్షంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా పెన్‌పహాడ్ మండలం దూపహాడ్‌కు చెందిన కత్తి ఉపేందర్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూర్.ఎస్ మండలం బొప్పారానికి చెందిన భాషా పంగు సత్యంను నియమించారు. అనంతరం ఉపేందర్ మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ శంకర్, ఉపాధ్యక్షుడు పాతకోట్ల రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిడమర్తి కమల్, సీనియర్ నాయకులు కొండగడుపుల సూరయ్య, కత్తి గురువయ్య, నకిరేకంటి వెంకన్న, నకిరేకంటి రాంబాబు పాల్గొన్నారు.

రేపు అప్రెంటిషిప్, జాబ్‌మేళా

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్‌ల అభ్యర్థులకు ఈనెల 11న నల్లగొండలోని ప్రభుత్వ ఐటీఐ (న్యూ) కళాశాలలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్, జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అప్రెంటిషిప్, జాబ్‌మేళా ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు www.apprenticeship india.gov.inలో వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మేళాకు హాజరు కావాలని సూచించారు.

• కల్యాణ వైభోగం





మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తజనం, కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఎవరైతే గెలుస్తారు..!

ఎంపీ అభ్యర్థుల ఎంపికపై బీఆర్‌ఎస్ కసరత్తు

- కాంగ్రెస్‌ను ఢీకొనే సమర్థత గల నేతల కోసం అన్వేషణ
- నాయకులతో చర్చలు జరుపుతున్న అధిష్టానం
- సామాజికవర్గాల వారీగా నేతల బలాలను లెక్కలేస్తున్న గులాబీ పార్టీ
- రెండు పార్లమెంట్ స్థానాలను గెలుచుకునేలా వ్యూహం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎంపీ అభ్యర్థుల ఎంపికపై బీఆర్‌ఎస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలకు ఆశావహులతో పార్టీ అధిష్టానంతోపాటు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఢీకొట్టేలా సత్తా కలిగిన నేతలను ఎంపిక చేయాలన్న ఆలోచనలో బీఆర్‌ఎస్ నాయకత్వం ఉండటంతో నేతలు ఆ వైపుగా కసరత్తు ముమ్మరం చేశారు. ఇదే అంశంపై జగదీష్‌రెడ్డి చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి.. బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించే సత్తా కలిగిన నేతలపై దృష్టి సారించారు.

నల్లగొండలో ఆశావహులతో చర్చలు

నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన వేమిరెడ్డి నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, బీసీ నేత సుంకరి మల్లేష్‌గౌడ్ పోటీచేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో నల్లగొండ అభ్యర్థిగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డి పేరును ప్రకటించింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మొదటి నుంచి పట్టుంది. ప్రస్తుతం ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట మినహా మిగిలిన ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసన సభ్యులే ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ జానారెడ్డికి కాకుండా ఆయన కుమారుడికి టికెట్ ఇచ్చినందున బలమైన నేతను నిలబెడితే గెలవవచ్చనేది బీఆర్‌ఎస్ ఆలోచన. ఇక్కడి నుంచి గిరిజన నేతను నిలబెడితే ఎలా ఉంటుందన్న ఆలోచనలో కూడా బీఆర్‌ఎస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు లక్షలకు పైగా గిరిజన ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన వర్గానికి చెందిన ఒక డాక్టర్‌ను సంప్రదించి పోటీచేయాలని కూడా బీఆర్‌ఎస్ పార్టీ కోరినట్లు సమాచారం. మరోవైపు.. బీసీ అభ్యర్థిని నిలబెట్టే అంశంపైనా అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలిసింది.

భువనగిరిలో బీసీనా.. ఓసీనా?

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూడా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి పోటీచేసేందుకు సుముఖత చూపుతున్నారు. నల్లగొండ, భువనగిరిలో ఏ స్థానం నుంచైనా అధిష్టానం అవకాశం ఇస్తే పోటీ చేసేందుకు సిద్ధమేనని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. గుత్తా అమిత్‌రెడ్డితో పాటు భువనగిరి నియోజకవర్గం నుంచి బూడిద బిక్షమయ్యగౌడ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, క్యామ మల్లేష్‌యాదవ్, జిట్టా బాలకృష్ణారెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వారితో కూడా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భువనగిరి నుంచి బీజేపీ బీసీ అభ్యర్థిని ఖరారు చేసిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ కూడా ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది. మొత్తంగా.. రెండు పార్లమెంట్ స్థానాల్లో బలమైన వ్యక్తులను నిలిపి విజయం సాధించే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమైంది.

చట్టాలపై అవగాహన కల్పించాలి

- గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సూర్యాపేటలో భరోసా, షీటీమ్ సెంటర్లు ప్రారంభం

సూర్యాపేట రూరల్: మహిళా రక్షణ చట్టాలపై గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట మండలం శాంతినగర్‌లో సువెన్ ఫార్మా కంపెనీ పక్కన పోలీసు శాఖ, సువెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాన్నిమాజీ మంత్రి దామోదర్‌రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ అవసరాల నిమిత్తం మహిళలు, పిల్లలకు ఒకేచోట కౌన్సిలింగ్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. భరోసా సెంటర్ ఏర్పాటు చేయడంపై పోలీసు శాఖ, సహకారమందించిన సువెన్ ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులను అభినందిస్తున్నామని తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. గంజాయి రవాణా, క్రయవిక్రయాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. మహిళా అండ్ చైల్డ్ వెల్ఫేర్ (భరోసా) సెంటర్ గురించి ఎస్పీ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాహుల్ హెగ్డే, కాంగ్రెస్ నాయకులు చెవిటి వెంకన్నయాదవ్, కొప్పుల వేణారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సువెన్ ఫార్మ కంపెనీ యాజమాన్యం, అదనపు ఎస్పీలు నాగేశ్వర రావు, జనార్దన్‌రెడ్డి, వెంకటరమణ, డీఎస్పీ రవికుమార్, భరోసా సెంటర్, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో కలెక్టర్ తదితరులు

ఏ అధికారిపైనా ఒత్తిళ్లు ఉండవు

హుజూర్‌నగర్: ఇది ప్రజా ప్రభుత్వమని ఏ అధికారిపైనా రాజకీయ ఒత్తిళ్లు ఉండవని చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ ఎస్.వెంకట్రావుతో కలిసి హుజూర్‌నగర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమ విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్ తగ్గినందున పైప్‌లైన్ పొడిగింపునకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈనెల 11వరకు ఎన్ఆర్ఈజీఎస్ కొత్త పనులు మంజూరు చేయాలని కలెక్టర్, డీఆర్‌డీఓలకు సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల మంజూరుపై మంత్రి సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, గ్రిడ్ ఈఈలు అరుణాకర్‌రెడ్డి, ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, డీఈలు వెంకట్‌రెడ్డి, అభినయ్, వంశీ, పీఆర్ ఈఈ వెంకటయ్య, డీఈఈ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఆర్‌డీఓ శ్రీనివాసులు, ఓఎస్‌డీ అన్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, ఎంపీ తదితరులు

మట్టపల్లిలో నారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీస్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృతాభిషేకం జరిపి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు మహోత్సం చేపట్టి కల్యాణం నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, నాగభూషణం, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌కు నేడు ప్రవేశ పరీక్ష

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్.రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఉదయం 10.30గంట వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పదోన్నతుల్లేని ఏఈఓలు!

- ఏళ్ల తరబడిగా విధుల్లో కొనసాగింపు
- అదే పోస్టులో ఉద్యోగ విరమణ
- వ్యవసాయ శాఖలో వింతపోకడ
- డిప్లొమా, డిగ్రీ ఉన్నా ప్రమోషన్లకు కలగని మోక్షం
- న్యాయం చేయాలంటున్న 80 మంది ఏఈఓలు



తిరుమలగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రభుత్వ శాఖల్లో ఏ చిన్న ఉద్యోగానికైనా సర్వీస్, పనితనాన్ని బట్టి పదోన్నతి ఉంటుంది. కానీ వ్యవసాయ శాఖలో వింత పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ శాఖలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)గా ఉద్యోగాల్లో చేరి సర్వీస్ మొత్తం విధులు నిర్వహించి అదే పోస్టులోనే ఉద్యోగ విరమణ పొందాల్సిన పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం జిల్లాలో 80 మంది ఏఈఓలు ఉన్నారు. అందులో అగ్రికల్చర్ డిప్లొమాతో పాటు ఒకేషనల్ కోర్సు, బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీలు చదివి ప్రతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏఈఓలుగా ఉద్యోగం చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో వీరే కీలకం

వ్యవసాయ శాఖలో క్షేత్ర స్థాయిలో విస్తరణ అధికారులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం వ్యవసాయ క్షేత్రాల పరిశీలనతోపాటు పంటల సాగులో మెళకువలను రైతులకు తెలియజేస్తారు. రైతు బంధు, రైతు బీమా, పంటల నమోదు ప్రక్రియ, విపత్తుల వల్ల కలిగే నష్ట పరిహారాలు, ఇలా అన్ని పనులు వీరే చేస్తున్నారు.

2006లో నియామకం

2006 సంవత్సరంలో ప్రభుత్వం అగ్రికల్చర్ డిప్లొమా, అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన వారిని పోటీ పరీక్షల ద్వారా ఏఈఓలుగా నియమిస్తుంది. అంతకు ముందు ఇంటర్, డిగ్రీతోనే నియమించేవారు. ప్రభుత్వ పరిధిలోని అన్ని శాఖల వారిలో డిప్లొమా వారికి సర్వీసును బట్టి పదోన్నతులు ఉన్నాయి. కానీ వ్యవసాయ శాఖ అందుకు భిన్నం. దీంతో వారు ఉద్యోగ విరమణ వరకు ఎన్నేళ్లు సర్వీసు చేసినా ఏఈఓగానే మిగిలి పోతున్నారు. జిల్లాలో 80 మంది ఉన్నప్పటికీ పదోన్నతులు మాత్రం కల్పించడం లేదు. దీంతో వారంతా ప్రభుత్వం తమ సేవలు గుర్తించి ఉద్యోగోన్నతి కల్పించక పోతుందా అని ఎదురుచూస్తున్నారు.

ఇతర శాఖల్లో మాదిరిగా..

అగ్రికల్చర్ డిప్లొమాతో ఏఈఓలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఏఓగా పోటీ పరీక్ష రాసుకునే అవకాశం లేకపోయింది. దీంతో ఏఈఓలు తీవ్ర ఆవేదనలో పడ్డారు. డిగ్రీ వారికి 60 శాతం కేటాయిస్తే తమకు 40 శాతమైన రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం పరీక్ష రాసుకునే అవకాశంతో పాటు తమకు మిగతా శాఖల్లో మాదిరిగానే పదోన్నతుల అవకాశం కల్పించాలని, లేదంటే సీనియారిటీని బట్టి సహాయ ఏఓలుగా నియమించాలని కోరుతున్నారు.

కోర్టు తీర్పును అమలు చేయాలి



ఒకేషనల్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్ చదువుకొని వ్యవసాయ శాఖలో ఏఈఓగా ఉద్యోగం సాధించాను. బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీతో పాటు తమ చదువును గుర్తించి ఏఈఓలుగా ఉద్యోగ పదోన్నతి కల్పించాలని గతంలో డిజిట్ వచ్చింది. పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి న్యాయం చేయాలి.

– వెంకట్‌రెడ్డి, ఏఈఓ, తిరుమలగిరి

దగ్గుమందు దందాపై ఆరా..

- ఏజెన్సీలను సైతం వదలొద్దు.. కేసులు పెట్టండి
- పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఎక్సైజ్ శాఖ డీజీ ఆదేశం
- కలెక్టర్ సూచనతో కదిలిన యంత్రాంగం



మత్తులో యువత చిత్తు!

దగ్గుమందు దందాపై 2023 డిసెంబర్ 17న సాక్షి ప్రచురించిన కథనం

కోదాడ: కోదాడ కేంద్రంగా సాగుతున్న దగ్గుమందు దందాపై రాష్ట్రస్థాయి అధికారులు ఆరా తీస్తున్నారు. యువతను చిత్తు చేస్తున్న ఈ దందాపై ఉక్కుపాదం మోపాలని, దీనిలో భాగస్వాములైన ఎవరినీ వదలొద్దని, ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేయాలని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీజీ వీబీ.కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో జిల్లా అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కూడా సీరియస్‌గా తీసుకోవడంతో పాటు మఠంపల్లిలో ఏమి జరిగిందో వివరాలు వెల్లడించాలని జిల్లా ఔషధ నియంత్రణ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. లైసెన్స్ ఉన్నప్పటికి నిబంధనలకు విరుద్ధంగా ఒక గ్రామీణ దుకాణానికి భారీ మొత్తంలో నిషేధిత దగ్గుమందును సరఫరా చేయడాన్ని తప్పుపడుతూ వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులు ఆదేశించడం సంచలనం కలిగిస్తోంది.

మూడు నెలల క్రితమే హెచ్చరించిన 'సాక్షి'

కోదాడ కేంద్రంగా నిషేధిత కొడిన్ పాస్ఫేట్ రసాయనం కలిగిన దగ్గుమందును విపరీతంగా అమ్ముతున్నారని, ఇవి కోదాడలో ఎక్కడ అమ్ముతున్నారో కూడా 'సాక్షి' సవివరంగా తెలిపింది. ఐనప్పటికి అధికారులు దీనిపై కనీస తనిఖీలు నిర్వహించలేదు. ఔషధ నియంత్రణ అధికారులుగాని, సివిల్ పోలీసులుగాని దుకాణాల యజమానులకు కనీస హెచ్చరికలు కూడా జారీ చేయలేదు. మారుమూలన ఉన్న మఠంపల్లిలోని మెడికల్‌షాపు సంవత్సరం కాలంలోనే రూ.30 లక్షల విలువైన దగ్గుమందును అమ్మినా, దాన్ని కోదాడలోని ఏజెన్సీలు సరఫరా చేసినా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోదాడ ఎక్సైజ్ పోలీసులు ఈ దందాను పక్కా ప్లాన్‌తో బయటపెట్టినప్పటికీ ఔషధ నియంత్రణ అధికారులు మాత్రం తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి, వాటి వివరాలను పూర్తిగా వెల్లడించకుండా చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దగ్గుమందు దందా రాష్ట్ర అధికారుల దృష్టికి పోవడంతో సెలవు దినమైనప్పటికి శనివారం ప్రెస్‌మీట్ పెట్టి ఇప్పుడు వివరాలు వెల్లడించడానికి సిద్ధమయ్యారు. దగ్గుమందు దందాను 'సాక్షి' జిల్లా ఔషధ నియంత్రణ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అలాంటిది ఏమి లేదని, మీకు సమాచారం ఉంటే చెప్పండని అనడం గమనించదగ్గ విషయం.

నిబంధనలు తుంగలో తొక్కి

కోదాడలోని కొన్ని మెడికల్ ఏజెన్సీలు లైసెన్స్ ఉందనే ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి మెడికల్ ఏజెన్సీ, రిటైల్ షాపుల నిర్వాహకులు కచ్చితంగా షెడ్యూల్ రిజిస్టర్ మెయిన్‌టెన్ చేసి షెడ్యూల్ ×హెచ్1 డ్రగ్‌ను సదరు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ, ఏ ఒక్కరూ దీన్ని పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. అధికారులకు ఇదంతా తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వైద్యులే అంటున్నారు. వైద్యుడి మందుల చిట్టీ ఉంటేనే అమ్మాల్సిన మత్తును కలిగించే ట్రమడాల్, నైట్రోజపం, ఆల్ప్రాజోలం, ఫోర్టువిన్ ఇంజెక్షన్లను పప్పుబెల్లాల్లా అమ్ముతున్నారు. దీంతో ఇవి సులువుగా దొరుకుతుండడంతో విద్యార్థులు వీటికి బానిసలుగా మారుతున్నారు.

అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు



మఠంపల్లిలో మాట్లాడుతున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్

మఠంపల్లి: మత్తు మందు, నిషేధిత డ్రగ్స్‌ను ఎవరైనా అక్రమంగా విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని సూర్యాపేట డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, కోదాడ ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్, మఠంపల్లి తహసీల్దార్ మంగా హెచ్చరించారు. శనివారం వారు మఠంపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం మఠంపల్లిలో దుర్గాభవాని మెడికల్ షాపు యజమాని అక్రమంగా మత్తు మందులు విక్రయించి పట్టుబడ్డారని పేర్కొన్నారు. 18సి చట్టం ప్రకారం అతని లైసెన్స్‌ను రద్దుచేసి చర్యలు తీసుకుంటామన్నారు. మందుల షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

జమ్మాపురంలో చైన్ స్నాచింగ్

భువనగిరి క్రైం : గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన భువనగిరి మండలం జమ్మాపురం గ్రామ స్టేజీ వద్ద శనివారం చోటు చేసుకుంది. జమ్మాపురానికి చెందిన లూయిమ్మ గ్రామ స్టేజీ వద్ద ఉదయం బస్సు కోసం వేచి చూస్తోంది. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి హమాలీ మృతి


పర్వతాలు (ఫైల్)

రాజాపేట: ప్రమాదవశాత్తు చింత చెట్టు పైనుంచి పడి ఓ హమాలీ మృతి చెందాడు. రాజాపేట మండలం పారుపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పారుపల్లి గ్రామానికి చెందిన కదారి పర్వతాలు (45)కు భార్య కమలమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇతను కొన్నేళ్లుగా రాజాపేట మండల కేంద్రంలో హమాలీ పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం పర్వతాలు తన భార్య, మరికొందరితో కలిసి చింతకాయలు దులిపేందుకు గ్రామంలోని చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడడంతో పర్వతాలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో భువనగిరి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు.

పిల్లలను పుస్తక పఠనం వైపు మళ్లించాలి

రామగిరి (నల్లగొండ) : ఈ రోజుల్లో పిల్లలు పుస్తకానికి దూరం అవుతున్నారని వారిని పుస్తక పఠనం వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని జాతీయ ఉత్తమ సినీ విమర్శకుడు డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య అన్నారు. శనివారం నల్లగొండలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముక్కామల జానకిరాం రచించిన ఆఫ్‌లైన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్ చేతికి వచ్చిన తర్వాత పిల్లలు చదవడం, రాయడంలో వెనుకబడుతున్నారని ఇది గమనించిన జానకిరాం ఆఫ్‌లైన్ కథలు రచించారని చెప్పారు. ఎన్జీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య మాట్లాడుతూ ఆఫ్‌లైన్ కథల్లో భాష, వస్తువు పిల్లల స్థాయిలో ఉన్నాయన్నారు. కథా రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ బాలల సాహిత్యానికి జానకిరాం ఒక భరోసా సంతకంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ హసేనా, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, తుల శ్రీనివాస్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, మునాసు వెంకట్, దొడ్డి రామమూర్తి, భాను శ్రీ కొత్వాల్, నామ వెంకటేశ్వర్లు, బండారు శంకర్, జంపాల మీనయ్య, సారంగి వెంకన్న, పీఎఫ్ ఖాన్, శివకుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు నవ వధువు బలి

- ప్రేమించి ఇటీవల కులాంతర వివాహం చేసుకున్న యువతి
- కులం పేరుతో దూషించడంతోనే ఆత్మహత్య చేసుకుందని బంధువుల ఆరోపణ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రవికిరణ్ రెడ్డి


భూమిక (ఫైల్)

భువనగిరి క్రైం : ప్రేమించి ఇటీవల వివాహం చేసుకున్న ఓ నవ వధువు అత్తింటి వేధింపులకు బలైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ దారుణ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల జమాల్ కుతూరు భూమిక(19), ఇదే గ్రామానికి చెందిన బిట్కూరి వెంకటేశ్ కుమారుడు మనోహర్ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరు గత ఫ్రిబవరి 17న కులాంతర వివాహం చేసుకుని అదే రోజు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రెండు కుటుంబాల పెద్దలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. వారం రోజుల క్రితం భూమిక తన తండ్రికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో పుట్టింటికి వెళ్లి పలకరించి వచ్చింది. అప్పటి నుంచి అత్త, భర్తలు భూమికను వేధించసాగారు. మీ పుట్టింటి కులం వేరని, ఎలా వెళ్తావని ఆమెపై దాడి చేశారు. దీంతో భూమిక ఇదే గ్రామంలో ఉంటున్న పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనో వేదనతో ఈ నెల 7న గదిలోకి వెళ్లి చీరతో ఉరేసుకుంది. గమనించిన తల్లి స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి భూమికను తొలుత భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఆగ్రహించిన బంధువులు భూమిక మృతదేహాన్ని భర్త మనోహర్ ఇంటి ముందు ఉంచి ధర్నా నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని భువనగిరి ఏసీపీ రవికిరణ్ రెడ్డి సందర్శించి వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి జమాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

బాలికపై లైంగికదాడి

- పరారీలో నిందితుడు

నేరేడుచర్ల : ఇంట్లో ఒంటరిగా ఉన్న 14ఏళ్ల బాలికపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భర్తతో విడిపోయిన ఓ మహిళ తన కూతురుతో కలిసి నేరేడుచర్లలో అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. వీరి పక్క పోర్షన్‌లోనే సుభానీ (45) ఇదే పట్టణానికి చెందిన ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సహజీవనం చేస్తున్న మహిళతో సుభానీకి గొడవ జరిగింది. దీంతో ఆమె పక్కనే ఉంటున్న బాలిక ఇంటికి వెళ్లి పడుకుంది. శనివారం ఉదయం సహజీవనం చేస్తున్న మహిళ ఇదే వీధిలో ఉన్న తన సొంత ఇంటికి వెళ్లింది. ఆమెతో పాటు బాలిక, ఆమె తల్లి కూడా వెళ్లారు. మధ్యాహ్నం బాలికను అద్దె ఇంటికి వెళ్లి భోజనం పెట్టుకు రమ్మని తల్లి పంపించింది. ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండడాన్ని సుభానీ గమనించాడు. అకస్మాత్తుగా ఇంట్లోకి వచ్చి బాలికపై లైంగికదాడి చేసి పారిపోయాడు. ఈ విషయంపై బాలిక తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. సంఘటన స్థలాన్ని హుజూర్‌నగర్ సీఐ చలమందరాజు పరిశీలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడిన సైదిరెడ్డి

నిడమనూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నిడమనూరు మండలం నర్సింహులగూడెం వద్ద శనివారం చోటు చేసుకుంది. మిర్యాలగూడకు చెందిన బట్టు సైదిరెడ్డి ఉదయం 9.30 గంటల సమయంలో యాచారంలో తోటవద్దకు స్కూటీపై వెళ్తున్నాడు. నర్సింహులగూడెం వద్ద వెనుకగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఇతడి స్కూటీని ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన సైదిరెడ్డిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించాలని బాధితుడు బట్టు సైదిరెడ్డి కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

నిధులు కేటాయించడం హర్షణీయం


కోతులారంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, అధికారులు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

మునుగోడు: గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, కేంద్రాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మునుగోడు మండలం కోతులారం గ్రామంలో ఎంపీలు, ఎమ్మెల్యే నిధులు రూ.30లక్షల నిధులతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు గ్రామాల్లోని పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, ప్రజాప్రతినిధులు పుట్టిన ఊరురుణం తీర్చుకునేందుకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. సొంత గ్రామమైన కోతులారం గ్రామ అభివృద్ధికి దాతల సహకారం రూ.కోటితో దేవాలయంతో పాటు సీసీరోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని, అందుకు గ్రామస్తులు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, పంచాయతీరాజ్ ఏఈ సతీష్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, గ్రామ మాజీ సర్పంచ్ జాజుల పారిజాతాసత్యనారయణ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కారు బోల్తా... ఆరుగురికి గాయాలు


బోల్తా పడిన కారు

మోత్కూరు : కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా కొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. గుండాల మండలం గంగాపురం గ్రామానికి చెందిన కాలి లక్ష్మి, తన కుమారుడు స్వామి, కూతురు కావ్య, అల్లుడు శ్రీశైలం, ఇద్దరు కోడల్లు భాగ్య, విజయలు కారులో శుక్రవారం చెరువుగట్టు జాతరకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా పట్టణంలోని నార్కట్‌పల్లి రోడ్డు వీరి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి, కావ్యలకు తీవ్ర మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో పైలెట్ తొంట భాస్కర్ జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

పాలకవీడు: షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన పాలకవీడు మండలంలోని మిగడంపహాడ్ తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన భూక్యా బాబు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మేళ్ల చెరువు జాతరకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గుడిసెలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. చుట్టు పక్కల వారు గమనించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే గుడిసెలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఎంపీపీ భూక్యా గోపాల్ బాధిత కుటుంబాన్ని రూ.10వేలు అందజేశారు. గ్రామస్తులు కూడా రూ.50వేల నగదు సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు.

ఉరేసుకుని వృద్ధుడి బలవన్మరణం

డిండి: ఉరేసుకుని ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన డిండి మండల పరిధిలోని గోనబోయనపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోనబోయనపల్లి గ్రామానికి చెందిన తగడపల్లి కృష్ణయ్య(70) గతంలో వీఆర్‌ఏగా పనిచేసాడు. కృష్ణయ్య చేస్తున్న వీఆర్‌ఏ ఉద్యోగంలో అదే గ్రామానికి చెందిన కొంతమంది దాయాదులకు కూడా భాగ పంపిణీ ఉంది. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు కృష్ణయ్య వీఆర్‌ఏ నుంచి ఇరిగేషన్ శాఖలో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం ద్వారా వచ్చిన జీతాన్ని పూర్తిగా నీవే అనుభవిస్తున్నావని కొంత డబ్బు తమకు కూడా ఇవ్వాలని దాయాదులు కృష్ణయ్యను డిమాండ్ చేశారు. నెల రోజుల నుంచి డబ్బు ఇవ్వాలని జరుగుతున్న పంచాయతీ కారణంగా మనస్తాపానికి గురైన కృష్ణయ్య శుక్రవారం రాత్రి ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికి అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహానికి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు పెద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.రాజు తెలిపారు.

అడవిదేవులపల్లిలో అశ్లీల నృత్యాలు

మిర్యాలగూడ : మహా శివరాత్రి సందర్భంగా అడవిదేవులపల్లి మండల కేంద్రం శివారులో గల పురాతన బౌద్ధమాలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి అశ్లీల నృత్యాలు చేశారు. కొందరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిలకలూరిపేట, నర్సారావుపేటల నుంచి యువతులను తీసుకొచ్చి దేవాలయాల వద్ద అశ్లీల నృత్యాలు చేయడంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో దేవాలయాల వద్ద అశ్లీల నృత్యాలు నిర్వహించడం కృష్ణపట్టె ప్రాంతంలో ఆనవాయితీగా మారింది. ప్రతి ఏడాది మహా శివరాత్రి, జాతరల సందర్భంగా ఇలాంటి అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరిని బలితీసుకున్న టిప్పర్ డ్రైవర్ అరెస్ట్


అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

- ప్రమాదంలో మృతిచెందిన తండ్రీకుమారుడి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి
- మిన్నంటిన గ్రామస్తుల, బంధువుల రోదనలు
- శోకసంద్రంలో బొల్లంపల్లి గ్రామం


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

అర్వపల్లి: మద్యం మత్తులో వాహనాన్ని నడిపి తండ్రీకుమారుల మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్ బొడ్డు శేఖర్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లిలో శుక్రవారం సాయంత్రం డ్రైవర్ శేఖర్ మద్యం మత్తులో టిప్పర్‌ను అతివేగంగా నడుపుకుంటూ వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలంలో ఉన్న గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్య, అతని చిన్నకుమారుడు విఘ్నేష్‌ను ఢీకొనగా ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. తండ్రీకుమారుల మృతదేహాలకు శనివారం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు అర్వపల్లి ఎస్ఐ మహేందర్‌నాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని నాగారం సీఐ రఘువీర్ రెడ్డి సందర్శించారు.

కన్నీటి వీడ్కోలు

ప్రమాదంలో మృతిచెందిన గద్దగూటి జానయ్య, అతని కుమారుడు విఘ్నేష్‌ల అంతిమయాత్ర శనివారం బొల్లంపల్లిలో నిర్వహించారు. గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని తండ్రీకుమారులకు కన్నీటి వీడ్కోలు పలికారు. దీంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. అంతిమయాత్రలో తండ్రీకుమారుల మృతదేహాలను తీసుకొని వెళుతున్న సన్నివేశాన్ని చూసి గ్రామస్తులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. జానయ్య తండ్రి మల్లయ్య, భార్య సుజాత, పెద్దకుమారుడు సాయి కృష్ణ, కూతురు అక్షయ కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి జానయ్యకు పెద్దకుమారుడు సాయికృష్ణ తలకొరివిపెట్టాడు.

బీజేపీ పాలన దేశానికి ముప్పు : జూలకంటి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

తుంగతుర్తి: బీజేపీ పాలన దేశానికి ముప్పు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు. మతోన్మాద బీజేపీని కాలగర్భంలో కలిపేందుకు ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు ఉన్నంత కాలం తెలంగాణలో బీజేపీకి, మత రాజకీయాలకు చోటు లేదన్నారు. రైతు చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, చెరుకు యాకలక్ష్మి, కోట గోపి, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్ రెడ్డి, మంగారెడ్డి, వజ్జె శ్రీనివాస్, కల్లేపల్లి భాస్కర్, కడియం కుమార్, పల్లా సుదర్శన్, కడెం లింగయ్య, దేవరకొండ యాదగిరి, ఓరుగంటి అంతయ్య, జోగునూరి దేవరాజ్, బొజ్జ శ్రీను, ఎల్లయ్య, పాలబిందెల జాను, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమపేరుతో అఘాయిత్యం

మీర్‌పేట: ప్రేమపేరుతో ఓ యువకుడు బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. నలగొండ జిల్లా చింతపల్లి మండలం గడియగౌరారం గ్రామానికి చెందిన శేఖర్ (28)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక (17)కు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఆ తర్వాత శేఖర్‌కు వివాహమై, ఇద్దరు పిల్లలున్న విషయం తెలిసి నిలదీయగా.. బాలికతో బలవంతంగా గర్భనిరోధక మాత్రలు మింగించాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై అస్వస్థతకు గురైన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు ఈ నెల 7న మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శేఖర్‌పై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

జూదం ఆడిస్తున్న ఐదుగురి అరెస్ట్

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శివాలయం వద్ద జూదం ఆడిస్తూ అమాయకులను మోసం చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రజితారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తులు జాతరలో (నల్లగుండు, పచ్చగుండు) జూదం నిర్వహిస్తూ అమాయకుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. రెండు రోజులుగా పెద్దమొత్తంలో నగదు చేతులు మారిందన్న సమాచారం మేరకు శనివారం దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఆట నిర్వహిస్తున్న పరికరాలతో పాటు ,కొంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

భువనగిరిటౌన్, బీబీనగర్: బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామంలో తప్పిపోయి చైల్డ్‌కేర్‌లో ఉన్న బాలుడిని శనివారం బాలల సంక్షేమ సమితి అధికారులు తల్లిదండ్రులకు అప్పగించారు. హైదరాబాద్‌లోని బడ్లగూడకు చెందిన ఆసియాబేగం తన కుమారుడు తప్పిపోయినట్లు నాగోల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదించగా బాలుడు యాదాద్రి జిల్లా కేంద్రంలోని బాలల సంక్షేమ సమితి అధికారుల ఆధీనంలో ఉన్నట్లు తెలిసింది. దీంతో బాలుడి తల్లి ఆసియాబేగం శనివారం ఇక్కడికి చేరుకుంది. బాలల సంక్షేమ సమితి అధికారులు నిర్ధారణ చేసుకొని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ బండారు జయశ్రీ,, సభ్యులు రోహిత, ఇస్తారి, జిల్లా అధికారి సైదులు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ దశరథ పాల్గొన్నారు.

మంగును నివారిస్తేనే..

- బత్తాయిలో ఆశాజనక దిగుబడులు
- పంటను కాపాడుకోవడంపై అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి సూచనలు


మంగు సోకిన కాయలు

పాడి పంట

గుర్రంపోడు : బత్తాయి తోటలు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో ఒకటైన మంగు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో సాగవుతున్న 40వేల ఎకరాల బత్తాయి తోటల్లో ఎంతో కొంత మంగు ఆశించని తోట అంటూ లేదంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో చెప్పవచ్చు. కాయలపై వక్క లేదా ఊదా రంగు లేదా ముదురు గోధుమరంగు ఏర్పడటాన్ని మంగు అంటారు. ప్రస్తుతం కత్తెర బత్తాయి కాయలు మంచి సైజును సంతరించుకునే దశలో ఉన్నాయి. ముఖ్యంగా చలివాతావరణం తగ్గి ఎండలు ప్రారంభమయ్యే ఫిబ్రవరి, మార్చి నెలల్లో మంగు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ దశలో మంగును నివారించి విలువైన కత్తెర బత్తాయి పంటను కాపాడుకోవడంపై అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి అందిస్తున్న సూచనలు, సలహాలు ఇవీ..

మంగు నల్లి నివారణ ఇలా..

రైతులు భూతద్దం సహాయంతో నల్లి ఉనికిపై నిఘా ఉంచాలి. ఒకటి, రెండు నల్లులు తోటలో ఎక్కడైనా పిందెలు, కాయలపై కనిపించగానే స్ప్రేయింగ్ మొదలు పెట్టాలి. రైతులందరూ సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి.

- చెట్లలో కొమ్మల కత్తిరింపులు సక్రమంగా సకాలంలో చేసి చెట్టు లోపల గాలి వెలుతురు బాగా ప్రసరించేటట్లు చూడాలి. తోటల్లో ఎండు పుల్ల కత్తిరించిన వెంటనే లీటరు నీటికి 3గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. ఈ రాగి దాతువు శిలీంద్రనాశిని కత్తిరించిన కొమ్మలకు రక్షణ ఇవ్వడమేగాక నల్లికి ప్రతి కూలంగా ఉంటుంది.
- మంగునల్లి నివారణకు మంగు నివారణ మందులను మార్చుతూ ప్రతి 15 లేదా 20 రోజులకోమారు ఏప్రిల్ నెలాఖరు వరకు పిచికారీ చేయాలి. ఆతర్వాత నెలకోసారి ఉధృతిని బట్టి పిచికారీ చేయాలి. లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల ప్రాపర్‌గైట్ లేదా ఒక గ్రాము డైపెంథిరాన్ లేదా రెండు మిల్లీ లీటర్ల ఇథియాన్ లేదా 5మిల్లీ లీటర్ల డైకోఫాల్ వంతున కలిపి మందు మార్చుతూ అవసరాన్ని పిందెలన్నీ తడిసేలా పిచికారీ చేయాలి.
- పిందెలు గోలికాయ సైజు నుంచి నిమ్మ కాయ సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పోటాష్, 5 గ్రాముల మల్టీకే ఒక మారు పిచికారీ చేస్తే నల్లిని అణచివేయడంతోపాటు కాయ సైజు నాణ్యత పెరుగుతుంది.
- నీటి తడులు ఎక్కువ కాకుండా అవసరం మేరకు డ్రిప్ పద్ధతిలో అందించాలి. సిఫారసు మేరకు సమతుల సమగ్ర ఎరువులు సకాలంలో అందించాలి. మంగు సోకిన కాయలను తోటలో ఉంచరాదు. తోటలో అంతరకృషి బాగా చేసి పరిశుభ్రతను పాటించాలి.

వాతావరణ మార్పులతో నల్లి ఉనికి ఉధృతం

ప్రస్తుతం క్రమంగా చలివాతావరణం నుంచి వేడి వాతావరణానికి మారుతున్న సమయం. వర్షాభావ పరిస్థితులు మంగు ఉధృతికి ఎక్కువగా దోహదం చేస్తాయి. వర్షానికి పురుగులు చెట్టు నుంచి జారి కింద పడి నశిస్తాయి. వర్షాలు తక్కువగా ఉంటే నల్లి పురుగులు చెట్లపైనే ఆవాసాన్ని ఏర్పరుచుకుని స్థిరంగా ఉంటాయి.

నల్లి పురుగులతో..

బత్తాయి కాయలపై మంగు ఏర్పడటానికి ప్రధాన కారణం మంగునల్లి. ఈ నల్లులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉంటాయి. వీటిని భూతద్దంలో సులభంగా చూడవచ్చు. వీటి పిల్లలు పసుపురంగులో, పెద్ద నల్లులు ఆరంజి రంగులో ఉంటాయి. పిల్ల, పెద్ద మంగు నల్లులు పిందెలపైన, కాయలపైన పారాడుతూ బత్తాయి కాయల తొక్కల నుంచి రసం పీల్చుతాయి. రసాన్ని పీల్చే ప్రక్రియలో నల్లి నోటి నుంచి రసాయాన్ని వదులుతుంది. ఈ రసాయనం కాయతోలు నుంచి స్రవించిన ద్రవం, సూర్యరశ్మి మార్పు చెంది తుప్పు రంగు మారుతుంది. బయటకు కనిపించే, సూర్యరశ్మి తగిలే కాయల్లో మంగు బాగా కనిపిస్తుంది. బత్తాయి పిందెలకు నల్లి ఆశిస్తే కాయ సైజు తగ్గదు కానీ మంగు వచ్చి తోలు గట్టిపడి పెలుసుగా మారుతుంది. కాయ రుచిలో తేడా రాదు. అయినా మంగు కాయలకు తోలు గట్టిపడి పెలుసుగా మారి చూడటానికి నల్లగా కనిపిస్తున్నందున మార్కెట్‌లో ధర పలకదు.